



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 12-04-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 174 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# కొలువుదీరిన కొత్త కేబినెట్



అమరావతి (విజయభాను న్యూస్) : ఏపీ కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్ర సచివాలయం సమీపంలోని పార్కింగ్ ప్రదేశం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై మంత్రులు ప్రమాణం చేస్తున్నారు. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కొత్త మంత్రులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత సత్తెనపల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబు మంత్రిగా ప్రమాణం చేశారు. అనంతరం అంజాద్ బాషా (కడప), ఆదిమూలపు సురేశ్ (యర్రగొండపాలెం), బొత్స సత్యనారాయణ (చీపురుపల్లి), బూడి ముత్యాల నాయుడు (మాడుగుల)తో గవర్నర్ ప్రమాణం చేయించారు. ఆ తర్వాత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి (డోన్), చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (రామచంద్రాపురం), దాడిశెట్టి రాజా (తుని), ధర్మాన ప్రసాదరావు (శ్రీకాకుళం), గుడివాడ అమర్‌నాథ్ (అనకాపల్లి) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గుమ్మనూరు జయరామ్ (ఆలూరు), జోగి రమేశ్ (పెడన), కాకాణి గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి), కారుమూరి నాగేశ్వరరావు (తణుకు), కొట్టు సత్యనారాయణ (తాడేపల్లి గూడెం), నారాయణస్వామి (గంగాధర నెల్లూరు), ఉష శ్రీచరణ్ (కల్యాణదుర్గం), మేరుగు నాగార్జున (వేమూరు), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (పుంగనూరు), పినిపె విశ్వరూప్ (అమలాపురం), పీడిక రాజన్నదొర (సాలూరు), ఆర్కే రోజా (నగరి), సీదిరి అప్పలరాజు (పలాస), తానేటి వనిత (కొవ్వూరు), విడదల రజని (చిలకలూరిపేట) మంత్రులుగా ప్రమాణం చేశారు.

## ఏపీ మంత్రులకు శాఖల కేటాయింపులు

కొత్త కేబినెట్‌లో ఐదుగురికి డిప్యూటీ సీఎంలుగా అవకాశం కల్పించారు. రాజన్న దొర, కొట్టు సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు, అంజాద్ బాషా, నారాయణ స్వామిలకు ఉప ముఖ్యమంత్రి హోదా కల్పించారు.

**అంబటి రాంబాబు** : జలవనరుల శాఖ
**అంజాద్ బాషా** : మైనార్టీ సంక్షేమ శాఖ (డిప్యూటీ సీఎం)
**ఆదిమూలపు సురేష్** : మున్సిపల్ శాఖ, అర్బన్ డెవలప్‌మెంట్
**బొత్స సత్యనారాయణ** : విద్యాశాఖ
**బూడి ముత్యాల నాయుడు** : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (డిప్యూటీ సీఎం)
**బుగ్గన రాజేంద్రనాథ్** : ఆర్థిక, ప్రణాళిక శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖలు
**చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ** : బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ
**దాడిశెట్టి రాజా (రామలింగేశ్వర రావు)** : రోడ్లు, భవనాల శాఖ
**ధర్మాన ప్రసాదరావు** : రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్
**గుడివాడ అమర్‌నాథ్** : పరిశ్రమల శాఖ, ఐటీ శాఖ, మౌలిక వసతులు, పెట్టుబడులు, వాణిజ్య శాఖ
**గుమ్మనూరు జయరాం** : కార్మిక శాఖ, ఎంప్లాయిమెంట్ శాఖ, ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖ
**జోగి రమేష్** : గృహనిర్మాణ శాఖ
**కాకాణి గోవర్ధన్‌రెడ్డి** : వ్యవసాయం, సహకార, మార్కెటింగ్ శాఖ

తరువాయి 2లో..

## ఏపీ మంత్రివర్గ ప్రమాణస్వీకారం..



## జ్యోతిరావు పూలేకు సీఎం జగన్ నివాళి



తాడేపల్లి (విజయభాను న్యూస్) : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం క్యాంప్ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొన్నారు.

## విశాఖ విమానాశ్రయంలో అప్పన్న విగ్రహం ఏర్పాటు

- శారదాపీఠాధిపతి చేతుల మీదుగా ఆవిష్కరణ
- స్వామిని దర్శించిన కేజీఎఫ్ హీరో యాష్



వార్త 4లో...

## సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే....

### జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి....

విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం, రక్తనాళాలు వంటి వారని చెప్పిన మహనీయుడు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. సోమవారం జ్యోతిరావు పూలే 196వ జయంతి వేడుకలను జోన్-4 పరిధిలో 29వ వార్డులో నౌరోజీ రోడ్డు, జంక్షన్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జునరావుతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ జ్యోతిరావు ఫూలే సేవలను గుర్తు చేసుకున్నారు అలాగే కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా

తరువాయి 2లో..






# విశాఖ హార్బర్ లో టీడీపీ కోటకు బీటలు

**- ఫిషింగ్ హార్బర్ యూనియన్ ప్రెసిడెంట్ గా వైకాపా నాయకుడు వాసుపల్లి జానకిరామ్**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలోనే అతిపెద్ద మత్స్య పరిశ్రమ అయిన విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ లో యూనియన్ ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కు గత 30 సంవత్సరాలుగా టిడిపి నాయకుడు పిసీ అప్పారావు కొనసాగుతూ వస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించిన బోటు యజమానులకు సరైన సమాచారం ఇవ్వకుండా అప్రజాస్వామ్య పద్ధతిలోనే ఎన్నికలు జరుగుతూ ఉండేవి. వైఎస్ఆర్సీపీ నాయకుడు వాసుపల్లి జానకిరామ్ యూనియన్ లో జరుగుతున్న అవకతవకలపై అప్పారావు నిరంకుశ పరిపాలన పై హార్బర్ లో తిరుగుబాటు జెండా ఎగురవేశారు. అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించాలని అందరూ కోరినా ఎన్నికలకు కాలయాపన చేస్తూ వచ్చారు. జిల్లా టీడీపీ వైస్ ప్రెసిడెంట్ గా ఉన్న పిసి అప్పారావు ఎలాగైనా తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని చాలా ప్రయత్నాలు చేసాడు. చివరకు ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో రాజీనామా ప్రకటించి తన వర్గం నుంచి ఒక వ్యక్తిని పోటీలో పెట్టినా బోటు యజమానులు అందరూ జానకి రామ్ కి మద్దతుగా నిలిచారు. ఓడిపోతానని భావించిన అప్పారావు వర్గం ఎలాగైనా రసాబస చేసి గొడవలు సృష్టించి ఎన్నికలను వాయిదా వేయాలని ఒక సందర్భంలో తీవ్రంగా ప్రయత్నించింది. బోటు యజమానులు ఎన్నికలు వాయిదాకు ఒప్పుకోకపోవడంతో, అందరూ జానకిరామ్ కు మద్దతుగా ఉండటంతో అప్పారావు వర్గం చేసేదిలేక పోటీ నుంచి మధ్యలోనే నిష్క్రమించారు. ఈ ఎన్నికల్లో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి మెజారిటీ సభ్యుల మద్దతు జానకిరామ్ కు ఉండటం, పోటీ చేస్తా అని ముందుకు వచ్చిన వాళ్ళ మీటింగ్ హాల్ నుంచి బయటకు వెళ్లిపోవడంతో వాసుపల్లి జానకిరామ్ ను ఏకగ్రీవంగా గెలిచినట్లుగా ప్రకటించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ జైలు నుంచి మత్స్యకారులను విడుదల చేయించడం, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో ఉండటం, రాష్ట్ర ప్రభుత్వం హార్బర్ సమస్యలను తీరుస్తుందనే గట్టి నమ్మకంతో నన్ను గెలిపించినట్లుగా జానకిరామ్ మీడియాకు తెలిపారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య జరిగిన ఎన్నికల్లో వందలాది మంది ఫిషింగ్ బోటు యజమానులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 16న జరగనున్న తెలుగమ్మాయి పోటీల తుది జాబితా విడుదల




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ ఆధ్వర్యంలో జరగనున్న తెలుగమ్మాయి పోటీలు లో తుది జాబితా ను వీరుమామ కార్యాలయం లో గ్రీన్ ఫీల్డ్ ఆర్గానిక్స్ రమేష్ బాబు, సంగీత , వీరుమామ విడుదల చేశారు. తెలుగమ్మాయి తుది పోటీలు చిల్డ్రన్స్ ఏరిన లో జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

తెలుగమ్మాయి - జాబితా : రేవతి,సిరి బుజ్జి,మహేశ్వరి,ఐశ్వర్య,కృష్ణవేణి,త్రిప్తి, సంకీర్తన,జయ రావు,మౌనిక,అనుపమ, ఉషరాణి, మానస, దీపికా, పద్మశ్రీ, శైలజ,సువర్ణ,సత్య,వెన్నెల, చందాన,మోనాలిసా, తెలుగుమహిళ - జాబితా : రమ్య నండూరి,నాశరీన్,జ్యోతి శ్రీ,సుష్మ, కీర్తన, జ్యోత్స్న, మౌనిక,చాందిని,తేజు, సుమాంజలి, ప్రవీణ,పద్మిని,మాధురి, సౌజన్య, శాంతి ప్రియా, లావణ్య, రమ్య, తేజేస్విని, టి. మీనాక్షి, మీనాక్షి,



శ్రీ స్వామివారి వార్షిక కళ్యాణానికి సర్వం సిద్ధం
విద్యుత్ అలంకరణతో దేదీప్యమానంగా
వెలుగొందుతున్న అప్పన్న దేవాలయం



# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



గాజువాక (విజయభాను న్యూస్ ): నియోజకవర్గం లోని 87 వ వార్డు అప్పికొండ కాలనీ లో వైస్సార్సీపీ స్టేట్ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ ఎన్నేటి రమణ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా వైస్సార్సీపీ గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి విచ్చేసి మహాత్మా జ్యోతి రావు పూలే భారత్ దేశంకి బడుగు బలహీన వర్గాల వారికీ చేసినట్టువంటి మేలు ఈ దేశంకి ఉపయోగపడైలాగా తన భార్య సావిత్రి భాయ్ పూలే విద్యాబ్యాసం నేర్పించి ఉపాద్యారాలు గా తయారు చేసి ఆమే ద్వారా ఈ దేశంలో ఎంతో మందికి మహిళలుకు అక్షరాశ్యులను చేసిన ఘనత ఆయనకే దక్కింది అని పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో డీసీఎంస్ చైర్మన్ పల్లా చింతల్లి,87వ వార్డు ఇంచార్జ్ కోమటి శ్రీనివాస్ రావు,వైస్సార్సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వెనుబాబు,బీసీ నాయకులు నక్క వెంకటరమణ, ముద్దపు దామోదర్ రావు,రెడ్డి జగన్నాధం, దుగ్గపు దానప్పలు, గాలి నూకరాజు, సారిపిల్లి గణపతి, బొండా గోవింద్రాజులు, వర్రే రాజు, ఎన్నేటి కుమారి, సారిపల్లి సత్యవతి, సారిపల్లి పార్వతి, కె వెంకటలక్ష్మి, కె బుజ్జమ్మ తదితర్లు పాల్గున్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : తగరపువలస సంతపేట లో బిజెపి భీమిలి నియోజకవర్గం ఓబీసీ కన్వీనర్ గుజ్జు గుణా దేవి, కో కన్వీనర్ తమ్మిన ఉమాదేవి ల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ ఓబిసి కన్వీనర్ & కో కన్వీనర్ లు మాట్లాడుతూ సంఘ సంస్కర్త గా సామాజిక తత్వవేత్త గా సమసమాజ స్థాపనకు అహర్నిశలు కృషి చేసి కుల వివక్ష కు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి రచయిత మహత్మ శ్రీ జ్యోతిబాపూలే నిఅస్పృశ్యతను అంటరాని తనాన్ని ఎండగట్టిన గొప్ప సంఘ సంస్కర్త సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మహాత్మా జ్యోతిరావు పూలే భావితరాల వారికి ఎంతో ఆదర్శం అని కొనియాడారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులు గా ఓబిసి బీజేపీ విశాఖ పార్లమెంట్ సెక్రెటరీ గనివాడ పార్వతి జీరు సత్యనారాయణ జీవీఎంసీ 1,2 వార్డులో అధ్యక్షులు శీరపు రామలక్ష్మి హాజరయ్యారు.

**మొదటి పేజీ తరువాయి**

# కొలువుదీరిన కొత్త కేబినెట్

కారుమూరి వెంకట నాగేశ్వరరావు : **పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ**
కొట్టు సత్యనారాయణ : **దేవాదాయ శాఖ (డిప్యూటీ సీఎం)**
నారాయణ స్వామి : **ఎక్సైజ్ శాఖ (డిప్యూటీ సీఎం)**
ఉషాశ్రీ చరణ్ : **స్త్రీ శిశు సంక్షేమ శాఖ**
మేరుగ నాగార్జున : **సాంఘిక సంక్షేమ శాఖ**
పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి : **విద్యుత్, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ-పర్యావరణ శాఖ, భూగర్భ గనుల శాఖ**
పినిపే విశ్వరూప్ : **రవాణా శాఖ**
రాజన్న దొర : **గిరిజన సంక్షేమశాఖ(డిప్యూటీ సీఎం)**
ఆర్కే రోజా : **టూరిజం, సాంస్కృతిక, యువజన శాఖ**
సీదిరి అప్పలరాజు : **పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ**
తానేటి వనిత : **హోంశాఖ, ప్రకృతి విపత్తుల నివారణ**
విడదల రజిని : **ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్య శాఖలు**

వీళ్లలో అంజాద్ బాషా, ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గుమ్మనూరు జయరాం, నారాయణ స్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పినిపే విశ్వరూప్ , సీదిరి అప్పలరాజు, తానేటి వనితలు రెండోసారి మంత్రులుగా అవకాశం దక్కించుకున్నారు.

# సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే....

ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని జ్యోతిరావు పూలే భావించారన్నారు. అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. మహిళలు చదువుకుంటేనే అసమానతలు తొలగిపోతాయని భావించి మొదట తన భార్య సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసిన గొప్ప ఆచరణ వాది అని కొనియాడారు. సమాజ పునర్నిర్మాణానికి జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు

నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నాయన్నారు. బలహీన వర్గాలకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందనీ తెలిపారు. వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని విద్య, ఉద్యోగ, ఆర్థిక

రంగాలలో మరింతగా ఎదగడమే జ్యోతిరావు పూలేకు నిజమైన నివాళులు అని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ అనగారిన వర్గాల అభ్యుదయానికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని, ఆయన అడుగు జాడలాలో అందరం నడవాలని, ఆయన సమాజం కోసం ఎనలేని సేవ చేశారని, సమాజ ఉద్ధరణకు ఎన్నో పుస్తకాలు రాశారని, కులవివక్షత పైన, మహిళా అభ్యుదయానికి ఎంతో కృషి చేసి బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో పాఠశాలల స్థాపించిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాధం, జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, అడిషనల్ కమిషనర్ వై. శ్రీనివాసరావు, సెక్రటరి ఎంవిడి ఫణిరాం, జోనల్ కమిషనర్ బి.వి. రమణ, రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, బీసీ కార్పొరేషన్ మెంబర్ ఫక్కీ దివాకర్, 29వ వార్డు కార్పొరేటర్ ఊరుకూటి నారాయణరావు, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఐ.టీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గుడివాడ అమర్నాథ్ ని మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేసిన విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ, గన్నమని వెంకటేశ్వర రావు (జీవీ).









ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుని ,విద్యుత్,సైన్స్ అండ్ టెక్నాలజీ,అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని, ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాద్ ని ,గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు అధ్యక్షులు నీలి రవి, పీలా వెంకటలక్ష్మీ, డైరెక్టర్ ఆళ్ల శివగణేష్, సీనియర్ నాయకులు కిరణ్ రాజు, రామరాజు,శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అవరోధాలను అధిగమించాలి

## ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : యువతరం సామాజిక అవరోధాలను అధిగమించి ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఏయూలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవాళ్లతో కూడిన జీవనం మన ముందుంటుందని, దీనిని స్వీకరించాలని సూచించారు. మహిళా సాధికారతతో దేశ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. విలువలను భవిష్యత్ తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలతో సామాజిక న్యాయాన్ని అందిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో 66 శాతం పదవులను అణగారిన వర్గాలకు అందించడం ముఖ్యమంత్రి వై.ఎస జగన్ మోహన రెడ్డి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నా యన్నారు.

బీసీ లైజన్ ఆఫీసర్ ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ పూలే జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిం చడం మంచి పరిణామమన్నారు. అణగారిన వర్గాలకురాజ్యాధికారాన్ని చేరువ చేస్తే వారికి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అందించినట్టేనన్నారు. ఏయూజాక్ అద్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ మాట్లాడుతూ సమన్యాయం, సమ్మిళిత ప్రగతి దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం పాలకులు పనిచేస్తున్నా రన్నారు. బీసీ సంఘం నాయకుడు పితాని ప్రసాద్ మాట్లాడు తూ ఏయూలో పూలే అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ పి.రాజేంద్ర కర్మార్కర్, కె.శ్రీనివాస రావు, వై.రాజేంద్ర ప్రసాద్, వి.విజయలక్ష్మి, డీన్‌లు ఎన్.సత్యనారాయణ, టి.షారోన్ రాజు, ఎన్.ఏ.డి పాల్, ఎన్.విజయ మోహన్, టి.వెంకట క్రిష్ణ, ఎస్.హరనాథ్,ఉద్యోగులు మెల్లేటి రాంబాబు, బి.వి రమణా రెడ్డి.

# ముగిసిన యమ్.సి.బి ప్రీమియర్ లీగ్-2022 క్రికెట్ పోటీలు



మధురవాడ (విజయభాను న్యూస్) : క్రీడల పట్ల యువత ఆసక్తి కనబరిచి దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లిలక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డ్ పరిధి బోట్టవానిపాలెం శివార్లలోగల ఫారెస్ట్ లేఅవుట్ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా పోతినఆనంద్,సునీల్ కుమార్ పోలిమాటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యమ్.సి.బి (మధురవాడ క్రికెట్ బాయ్స్) ప్రీమియర్ లీగ్-2022 క్రికెట్ సీజన్-4 పోటీలు సోమవారం ఘనంగా ముగిసాయి.16రోజుల పాటు జరిగిన ఈక్రికెట్ పోటీలలో స్థానిక 5,6,7,8 వార్డుల నుండి సుమారు 40 క్రికెట్ జట్లు పోటీ పడ్డాయి. మొదటి స్థానంలో పరదేశిపాలెం, ద్వితీయ స్థానంలో కొమ్మాది, తృతీయ బహుమతి శివశక్తి నగర్ హ్యాంగ్ అవర్స్-11జట్టు నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లిలక్ష్మణరావు హాజరై గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన ఆటలతో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందిం చడం శుభ పరిణామమని అన్నారు. పోటీలను ఈస్థాయిలో నిర్వహిం చన నిర్వాహకులను, సహకరించిన దాతలను,ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈసందర్భంగా ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డుటీడీపి అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ( జపాన్), నమ్మి రమణ, కనక దుర్గ సప్లయర్స్ అధినేత కొర్రయిసురేష్,జగదభిరామా కన్స్ట్రక్షన్స్ అధినేత నక్కా శ్రీధర్,బాబా కన్స్ట్రక్షన్స్ అధినేత తరుణ్ రెడ్డి,వీరు, బి.ఎల్.ఆర్.రియల్ ఎస్టేట్ అధినేత బగాది లక్ష్మణ, కె.వి.ఆర్.ఈవెంట్స్ అధినేత గురునాథ్,లంక రాజేంద్ర ప్రసాద్(పొట్టి ప్రసాద్),దుర్గా, రమేష్,క్రాంతి,సాయి,కాలు, ఆనంద్,నాని,తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులపై ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ కక్షసాధింపు ధోరణి మానుకోవాలి

- కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు
- షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ నాయకులు
- శరగడం రామునాయుడు



చోడవరం( విజయభాను న్యూస్) : షుగర్ ఫ్యాక్టరీ లో పనిచేస్తున్న కార్మికులపై ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తోందని, అపోజిషన్ లో ఉన్నప్పటికీ , కార్మికులకు అండగా షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ఉంటుందని, అవసరమైతే కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని యూనియన్ నాయకులు శరగడం రామునాయుడు అన్నారు. ఇటీవల ఫ్యాక్టరీ యాజమాన్యం కొందరి కార్మికులపై చేపడుతున్న నిరంకుశ తీరును సోమవారం కార్మికులకు వివరించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొందరు చెప్పుడు మాటలు విని ఫ్యాక్టరీ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని, షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ను అస్థిర పరిచేందుకు చూస్తుందని అన్నారు. దీనిలో భాగంగానే యూనియన్ నాయకులు రాయి సూరిబాబు పై చర్యలు చేపట్టా రని, అలాగే మరి కొందరు పై కూడా వారి ఇష్టానుసారం సస్పెండ్ చేయడం చేస్తున్నారని, మండిపడ్డారు. యాజమాన్యం తన వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదు అన్నారు. గుర్తింపు కార్మిక యూనియన్ నాయకులు కార్మికుల కష్టనష్టా లు గుర్తించి, వారి సంక్షేమం పై దృష్టి పెడితే బాగుంటుందని, రాజకీయాలు ఉంటే ఫ్యాక్టరీ గేటు బయట ఉండాలని, అంతేకానీ ఫ్యాక్టరీ లోపల చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. ప్రతిపక్ష యూనియన్ నాయకులు పై చర్యలు తీసుకోవడం, కుర్చీలు బల్లలు తొలగించడం సిగ్గుమాలిన చర్య అని, మా ఆరేళ్ల కాలంలో ఎప్పుడు ఇలాంటి వాటికి తావు ఇవ్వలేదన్నారు.

గుర్తింపు యూనియన్ కు చేతనైతే ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఒకటో తారీఖు జీతం ఇవ్వాలని, పిఎఫ్ గ్రాట్యుటీ సకాలంలో చెల్లించాలని, మా హయాంలో కార్మికుల పదవి విరమణ 58 నుంచి 60 ఏళ్లకు తీసుకొచ్చామని, మీకు చేతనైతే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెంచిన పదవి విరమణ వయసు 62 ఏళ్ళు ఫ్యాక్టరీ కార్మికులకు వర్తింప చేసేందుకు పోరాడి చూపించాలన్నారు. ఎవరెన్ని చేసినా కార్మికులకు అండగా షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ఉంటుందని, అవసరమైతే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్మికులపై కక్షసాధింపు ధోరణి యాజమాన్యం ఇప్పటికైనా మానుకొని, చెప్పుడు మాటలు విని కాకుండా తన సొంత నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# బూడి ముత్యాలనాయుడుకి అరుదైన గౌరవం

- ఏపీ క్యాబినెట్లో చోటు
- డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కేటాయింపు
- సంబరాల వాతావరణంలో మాడుగుల నియోజకవర్గం







దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేసిన ప్రభుత్వ విప్, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడుకు తగిన ప్రతిఫలం దక్కింది. ఉత్తరాంధ్రలో బలమైన సామాజిక వర్గానికి చెందిన బీసీ (కోప్పల వెలమ) బూడి ముత్యాల నాయుడుకు ఏపీ కేబినెట్లో చోటు దక్కించుకుని కీలకమైన పదవులు పొందారు. డిప్యూటీ ముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. వార్డ్ మెంబర్ స్థాయినుంచి విస్గా ఎదుగుతూ ఇప్పుడు మరింత కీలక బాధ్యత లతో సొంత జిల్లాకు తిరిగి రానున్నారు. బూడి ముత్యాలనాయుడు డిప్యూటీ సీఎంతో పాటు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా కొలువు దీరడంతో మాడుగుల నియోజకవర్గం ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం అవుతుండగా, గ్రామాలలో సంబరాల వాతావరణంలో పార్టీ శ్రేణులు సందడి చేస్తున్నారు. పలు గ్రామాల్లో పాటు మండలంలోని కొత్తపెంట గ్రామంలో సర్పంచ్ రొంగలి వెంకటరావు ఆధ్వర్యంలో బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంచి సీఎం జగన్మోహన్ రెడ్డికి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గ్రామస్తులంతా రోడ్డుపైకి వచ్చి కేకు కట్ చేసి సీఎం జగన్, మంత్రి బూడికి జై జైలు పలికారు. అందరూ అనుకున్నట్లుగానే ఆయనకు మంత్రి పదవి దక్కడం ఒక వరం లాంటిది అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలోనే కీలక బాధ్యతలు అప్పగించి సమర్థత, నమ్మకానికి, విశ్వసనీయతకు వైఎస్ఆర్ జగన్ సర్కార్ పెద్ద పీట వేసిందని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ గా పనిచేసిన తన తండ్రి బాటలోనే బూడి ముత్యాలనాయుడు వార్డ్ మెంబర్ నుంచి ఉప సర్పంచ్, సర్పంచ్,ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పిటిసి పదవులు చేపట్టి 2014లో మాడుగుల శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా, శాసనసభాపక్ష ఉప నేత గా వ్యవహరించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2014లో వైయస్సార్సీపి మూడు చోట్ల ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకోగా అందులో ఇద్దరు ఎమ్మెల్యేలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆ సమయంలో బూడి ని కూడా పార్టీలో చేరేందుకు టిడిపి ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన జగనన్న వెంటే నిలిచారు. ఆయనతో ఊపిరి ఉన్నంతవరకు ఉంటానని బహిరంగంగా ప్రకటించి నమ్మకానికి మారుపేరుగా నిలిచారు.

ఆ నమ్మకం 2019లో ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించారు. అనంతరం మూడేళ్ల పాటు ప్రభుత్వ విప్ గా వ్యవహరించారు. ఇప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి కొత్త క్యాబినెట్లో మంత్రిగా అవకాశం కల్పించారు. మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి బయల్దేరిన బూడి వెంట నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు తరలి వెళ్లారు. డిప్యూటీ సీఎంగా, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా పదవి కేటాయించడంతో వైసిపి శ్రేణులు అభిమానులు నాయకులు బూడిని అభినందిస్తూ దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి, కె.కోటపాడు ఎంపీపీలు కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు,రెడ్డి జగన్ మోహన్, వరదరెడ్డి సింహాచలం నాయుడు, లలిత నాయుడు, కె.వి.రమణ,వేచలపు అప్పలనాయుడు, వాలేటి నాగరాజు, దేముడు బాబు, కె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన కల్వర్ట్ కథ



మధురవాడ (విజయభాను న్యూస్) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా రోజురోజుకీ పెరుగుతున్న అనధికార నిర్మాణాలు పై చర్యలు తీసుకోవాలని తెలుగు తమ్ముళ్లు తమ స్వరం పెంచారు ఈ నేపథ్యంలో 6 వార్డు టిడిపి అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా చేస్తున్న నిరసనలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. మహా విశాఖ 6 వార్డ్ పరిధి పీఎంపాలెం గాయత్రీ నగర్ సమీపంలో గల మధురవాడ సర్వేనెంబర్ 224 గెడ్డ వాగుపై అనధికారికంగా నిర్మించిన కల్వర్టును రెవిన్యూ జివిఎంసి అధికారులు సంయుక్తంగా సోమవారం తొలగించారు. గత కొన్ని రోజులుగా అనధికారికంగా కల్వర్టు నిర్మించారని పత్రికల్లో వార్తా కథనాలు రావడంతో తెలుగు తమ్ముళ్లు స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించి విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వచ్చి అనధికారికంగా నిర్మించిన కల్వర్టును తొలగించేందుకు కృషి చేశారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా గెడ్డ వాగులో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని కూడా తొలగించాలని అధికారులను కోరారు. దీనిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు చేశారు అలాగే మూసివేసిన రహదారిని కూడా తెరిపించేలా కృషిచేయాలని టిడిపి నాయకులను స్థానికులు కోరారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, కెవిఆర్ గురునాథ్ తదితరులు పాల్గున్నారు.

# విజయభాను సంపాదకీయం

## ఊహాలోకంలో...

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హోటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది.

యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్ధాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే ట్కస్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేకపోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించుకోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొందరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.

# విశాఖ విమానాశ్రయంలో అప్పన్న విగ్రహం ఏర్పాటు

**- శారదాపీఠాధిపతి చేతుల మీదుగా ఆవిష్కరణ - స్వామిని దర్శించిన కెజిఎఫ్ హీరో యాష్**





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహిమాన్వితుడైన సింహచలం శ్రీ వరహాలక్ష్మి నృసింహస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా ఈ విగ్రహన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర మాట్లాడుతూ ప్రపంచంలోనే సుందర నగరంగా పేరుగాంచిన విశాఖకు నిరంతరం వేలాది మంది పర్యాటకులు,ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, వారంతా స్వామిని దర్శించుకోవడానికి ఈ విగ్రహం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అంతేకాకుండా అత్యవసర పనులపై వెళ్లే వారు కూడా స్వామిని దర్శించుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. స్వామి వారి క్షేత్రమహిత్యం,చరిత్ర అందుబాటులో ఉంచడం వల్ల దేశ వ్యాప్తంగా అప్పన్న గొప్పతనం తెలుస్తుందన్నారు.విమానాశ్రయంలో విగ్రహం ఏర్పాటు చేసిన ఆలయ ఈవో ఎంవీ సూర్యకళను, ట్రస్టుబోర్డు సభ్యులను స్వరూపానందేంద్ర అభినందించారు. ఆలయ ఈవో సూర్యకళ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ పట్నం రైల్వేస్టేషన్‌తో పాటు, తాజాగా విమానాశ్రయంలో కూడా స్వామి విగ్రహం ఏర్పాటు చేయగలిగామన్నారు.త్వరలో భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో కూడా అప్పన్న విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాస్, ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు,దినిష్‌రాజు,దొడ్డి రమణ, సతీష్,పాత్రుడు, చందు,సువ్వాడ శ్రీదేవి, వంకాయల నిర్మల,రామలక్ష్మీ తదితరులు పాల్గొని పూజలు చేశారు.

**- తొలిసారిగా దర్శించుకున్న కేజీఎఫ్ హీరో**

విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన అప్పన్న విగ్రహం వద్ద కేజీఎఫ్ హీరో యాష్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో సూర్యకళ, ట్రస్టు బోర్డు సభ్యులు స్వామి క్షేత్రమహిత్యాన్ని తెలియజేశారు. ఆయా కార్యాక్రమంలో స్థానాచారులు టీపీ రాజ్‌గోపాల్, పురోహితులు కరి సీతారామాచార్యులు, ఏఈవో రమణమూర్తి, విగ్రహశిల్పి రమణ, ఆలయ ఈఈ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



**ఆంధ్రప్రదేశ్‌లో నూతన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గుడివాడ అమరనాథ్ కి విశాఖ జిల్లా తరుపున మంత్రివర్గంలో స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ సందర్భంగా మంత్రి గుడివాడ అమరనాథ్ ని మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసిన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం.**

## కవి సమయం

### మధుర భాషణం

మధుర భాషణం శాంతిమయ జీవవానికి సోపానం
ఓదార్పు నిచ్చే ఒక మంచి మాట
వెన్నెల లాంటి చల్లదన్నానిచ్చే ఒక హిత వచనం
జీవితాలను ధైర్యమిచ్చి నిలబెడతాయి
ప్రేమతో కూడిన మధురమైన పలుకులు
నడి సంద్రం లో కొట్టుకొని పోవు వారికి దొరికే ఆలంబన వంటివి
మధుర భాషణం గావించలేని వారు రజో గుణ సంపన్నులు
అసుర సమానులు, అనుక్షణం కొండంత పాపాన్ని సమకూర్చుకుందురు
కటువైన మాటలు గోడకు కొట్టిన బంతుల వంటివి
మరింత వేగం గా, తీవ్రం గా, కటువుగా వచ్చి విసిరిన వారికే తగులును
మనం నాటిన విత్తనాల పంట మనమే అనుభవించక తప్పదు
మధుర భాషణమును చేసిన బుద్ధుడు, మహమ్మద్, జీసస్ మనకు ఆధారం
అందుకే సమాజం లో సత్యం, ధర్మం, అహింస స్థాపనకు
ఆనందమయ సమ సమాజ నిర్మాణమునకు
మధుర భాషణమనే సద్గుణమును అలవర్చుకుందాం
మహనీయిలుగా చరిత్రలో సుస్థిర స్థానమును సాధించుకుందాం

...కవిత రచన
సి . ప్రతాప్

## పంచాంగం

| మాసం : ఫాల్గుణ; తిథి : ఏకాదశి రా.2.17; ఆశ్రేష ఉ.6.02; సా.వ.6.44ల 8.25. | మంగళవారం 12-04-2022 |
|---|---|

a **మేషం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.b **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. c **మిథునం** : ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెం టేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెం టేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. d **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యో గస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్ర బృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరి ష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. e **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. f**కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. g **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. h **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. i **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. j **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. k **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ అంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. L **మీనం** : ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది.

# ఏపీ సేవా పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం చేయాలి

## - ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి - జిల్లాను అన్ని రంగాలలో ముందుంచాలి

### -జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నూతన విశాఖపట్నం జిల్లాను అన్నిరంగాలలో ముందంజలో ఉండేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున తెలిపారు.సోమవారం ఉదయం జిల్లాకలక్టరువివిధ అంశాల పై అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా కలక్టరు మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా లో అర్బన్ ప్రాంతము అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ, ప్రజలకు సేవలు అందించడం మొదలగు విషయాలలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమంగా ఉండేలా ప్రతి అధికారి శ్రద్ధ వహించాలన్నారు. ఎ.పి సేవా పోర్టల్ : ఈ పోర్టల్లో సర్వీసులు ప్రారంభం అయ్యాయి. ఈ పోర్టల్ ను ప్రతీ అధికారి ప్రతి రోజు పరిశీలించి వచ్చిన పిటీషన్లను పరిష్కరించాలన్నారు. పిటిషన్లు ఏ స్థాయిలో, ఎవరి వద్ద ఉన్నదీ ఈ పోర్టల్ లో తెలుస్తుందన్నారు. జిల్లా అధికారులు, MPDO లు , తహసీల్దార్లు, అందరూ ప్రతి రోజు ఈ పోర్టల్ ను పరిశీలించాలన్నారు. పిటిషన్లను తిప్పి వేసినపుడు దానికి పూర్తి వివరాలను తెలియజేయాలన్నారు. ఫైళ్ల బదిలీ : నూతన జిల్లాలు ఏర్పాటు సందర్భముగా వివిధ శాఖల జిల్లా అధికారులు అనకాపల్లి మరియు అల్లూరి జిల్లాలలోని సంబంధిత శాఖల అధికారులకు ఫైళ్ల ట్రాన్స్ఫర్ ప్రొసీజర్ పై NIC అధికారి పాషా, జిల్లా అధికారులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. విశాఖపట్నం 10-20 సంవత్సరాలలో అత్యంత ప్రాముఖ్య నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని చెరువులు, కాలువలు అన్నింటిని వాటి పరిస్థితి పై సర్వే గావించాలని ఆదేశించారు. వాటిలో ఆక్రమణలను గుర్తించాలన్నారు. దీని వల్ల భావితరాలకు మనం సేవలు అందించిన వారం అవుతామన్నారు.

విశాఖ జిల్లా ప్రస్తుతం 75% అర్బన్ మరియు 25% గ్రామీణం కలిగి ఉందన్నారు జివియంసి మరియు వివిధ శాఖల అధికారులు సమర్థవంతముగా పనిచేసి జిల్లాను అన్ని రంగాలలో మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ఈ విషయంలో వెనుకబాటును సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, అసిస్టెంట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# గిరిజన ప్రాంతంలో నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు



అనంతగిరి, విజయభాను న్యూస్ : గిరిజన ప్రాంతం లోని అక్షరాస్యత పెంపుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డి.డి డి.మణికుమార్ తెలిపారు. సోమవారం నాడు అనంతగిరి బాలికల 1 పాఠశాలను సందర్శించారు. తరగతి గదిలో ఉన్న విద్యార్థులు తో కాసేపు విద్యపై సమీక్షించారు. అలాగే బాలికల తో పాటు డి.డి, అక్కడే భోజనం చేశారు. అనంతరం స్థానిక విలేకరు లతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చెయ్యాలి అన్నారు. ముఖ్యంగా ప్రాధమికస్థాయిలో ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే వసతి గృహాల్లో నిజంగా విద్యార్థులకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే దర్యాప్తు నిర్వహించి శాఖాపర మైనచర్యలుతీసుకుంటామని డిడి తెలిపారు. ఇటీవల గుమ్మకోట గురుకులం లో అన్యాయం జరుగుతుందని, యస్.టి, కమిషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం తో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు దర్యాప్తు నిర్వహించి ప్రిన్సిపల్ పైశాఖాపరమైన చర్యలుతీసుకున్నామని తెలిపారు. అందువలన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న హెచ్.ఎం లు, వార్డెన్ లు, సక్రమంగా విధులు నిర్వ హించి నాణ్యమైన విద్యను అందిం చాలని హెచ్చరించారు. త్వరలో జరగబోవు 10 తర గతి పరీక్షలు కు పూర్తి స్థాయి ఏర్పాటు లు చేస్తున్నామని తెలిపారు. ఆదివారంనాడు రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు సేనాపతి, పిల్లలకు తమ సంతాపం వ్యక్తం చేశారు. డి.డి మణికుమార్ తో పాటు ఏ.టి.డబ్ల్యూ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిడి

# అన్ని వర్గాలకు మేలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాను

## జివియంసి 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు

అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ : అన్ని వర్గాలకు మేలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నానని జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. సోమవారం వార్డు పరిధిలోని భీమ్ నగర్ ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంచినీటి కుళాయి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రాగునీరు వాడుక నీరులేక చిన్నారులు అంగన్వాడీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించానని జీవీఎంసీ అధికారులతో సంప్రదించి మంచినీటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తన దృష్టికి వచ్చిన వార్డు సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు నాగరాజు తెలిపారు. తాగు నీటి కొళాయి ఏర్పాటుచేయించి తమ సమస్యను పరిష్కరించిన నాగరాజుకు అంగన్వాడీ సిబ్బంది కృత్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎస్ కే పర్వీన్ సుల్తానా, మహిళా పోలీస్ కె రాధా,నూకరాజు,సి హెచ్ ఎర్రయ, దివ్య, లావణ్య , భారతి , జయ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి జోలికెళ్లి జీవితాలను పాడుచేసుకోవద్దు

## మంప ఎస్సై లోకేష్‌కుమార్

కొయ్యూరు, విజయభాను న్యూస్ : గంజాయి జోలికి వెల్లి మీ జీవితాలను పాడు చేసుకోవద్దని మంప ఎస్సై లోకేష్ కుమార్ కోరారు. కొయ్యూరు మండలం మారుమూల బూదరాళ్ల పంచాయితీ బాలరేవుల రోడ్, చీడిపల్లి, కొత్తపల్లి, కునుకూరు, లోయలపాలెం, నూకరాయి తోట, పిడుగు రాయి, గ్రామస్తులతో గంజాయితో ఎదురైన సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయిని పండించడం, రవాణా చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. డబ్బులకు ఆశపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి వల్ల బయట కొన్ని కోట్ల కుటుంబాలు జీవితాలు నాశనం అయిపోతున్నాయని, గంజాయి సాగు చేసి రవాణా చేసేందుకు డబ్బు ఆశ చూపి దళారులు మిమ్మల్ని ఉపయోగించుకుంటున్నారన్నారు. చివరికి మీ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని వివరించారు. ఇలాంటి పంటను పండించి జీవితం నాశనం చేసుకునే గంజాయి సాగుకంటే అదే స్థానంలో మన ప్రాంతంలో మెరుగ్గా పండే సాంప్రదాయక పంటలైన రాగులు, కందులు, బీన్స్ కొర్రలు, సామలు వంటి పంటలు పండించి ఆనందకరమైన జీవితాన్ని గడపాలని కోరారు.



మాట్లాడుతున్న మంప ఎస్సై లోకేష్‌కుమార్

## వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘ అధ్యక్షులు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 196 వ జయంతి వేడుకలు



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : ఆంధ్రప్రదేశ్ వెనుక బడిన కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం మహాత్మా జ్యోతిరావు పూలే 196 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా సంఘం కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి 35వ వార్డు కార్పొరేటర్ మరియు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అయినటు వంటి విల్లూరి భాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అలాగే తదుపరి జడ్జి కోర్ట్ దగ్గర గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సభ్యు లందరూ కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు కొణతాల శ్రీనివాస్ మాట్లాడుతూ జ్యోతి రావు పూలే ఒక ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని, ఆనాడే సమాజంలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత జ్యోతిరావు పూలేది అని, మహిళలకు విద్య అవసరం ఎంతైనా ఉందని తెలుసుకొని తన భార్య అయిన సావిత్రిబాయి పూలేకి విద్యను ముందు నేర్పించి, ఆమె ద్వారా మహిళలకు విద్య కు శ్రీకారం చుట్టిన ఘనత జ్యోతిరావు పూలేదే అని, ఇటువంటి మహ నీయులు ఎందరికో ఆదర్శం అని కొనియాడారు అలాగే వెల్లూరు భాస్కర్‌రావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే కారణ జన్ముడని, అటువంటి వ్యక్తిని స్మరించుకోవడం మా పూర్వజన్మ సుకృతం అని ఆయన అడుగుజాడల్లోనే ఈరోజు ఎంతో మంది ప్రయాణం చేస్తు న్నామని, ఉదాహరణకి నిన్న ప్రవేశపెట్టిన మంత్రుల జాబితాలో కూడా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు, ఎస్సీలకు, ఎస్‌టి లకు, మైనార్టీ లకు పెద్దపీట వేశారని తెలియజేశారు. సంఘం కార్యదర్శి కె.రామ్‌కుమార్ మాట్లాడుతూ ఈనాడు ఎంతో సాంకేతికంగా అభివృద్ధి చెందినా, ఆనాడు ఎటువంటి అవకాశాలు లేకపోయి నప్పటికీ జ్యోతిరావు పూలే తను నమ్ముకున్న సిద్ధాం తాల మేరకు తన భార్య అయిన సావిత్రిబాయి పూలే తోడు తీసు కుని, ఎన్నో ప్రజా ఉపకారమైన సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శ దంప తులు అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అప్పారావు, సలహాదారు సిహెచ్.వెంకటేశ్వరరావు, సంఘం సభ్యులు బి.త్రినాధ్. రాందేవ్. వై.రవణమ్మ, కె.కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.




**తేది 2.4.22 నుండి శ్రీ సీతరామ చంద్రస్వామి దేవస్థానం, అంబికా బాగ్, మహారాణి పేట ,విశాఖపట్నం .నందు నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా నేడు శ్రీ స్వామివారికి పట్టాభిషేకం నిర్వహించడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శాంతి కాలిం గిరి మరియు ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లి. సింహాచలం ,సభ్యులు బి.అనురాధ బి.ఎస్.ఆర్.వాణి, ఎమ్. ధన లతా, బి .వెంకట రత్నం, ఎన్.ఎస్ ఎస్.సుబ్రహ్మణ్యం, దేవస్థానం సిబ్బంది పాల్గొనడం జరిగినది.**



# మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పాటు



బీ వ ం ం ని వ ట్నం (విజయభాను న్యూస్): జివియంసి నాలుగవ వార్డ్ చేపలుప్పాడ లో సాంప్రదాయ మత్స్య కారులు రైతు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడితే వారి అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని జాతీయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. శ్రీ లిఖీ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి నాలుగో వార్డు లోని చేపలుప్పాడ మత్స్యకారులతో సోమవారం నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. చేపల నిల్వ కు శీతల గిడ్డంగులు నిర్మిస్తామని, రవాణా కు అవసరమైన వ్యాన్ లు అందిస్తామన్నారు .ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక నాల్గో వార్డ్ కార్పొరేటర్ ధౌలపల్లి కొండ బాబు మాట్లాడుతూ చేపలుప్పాడ పరిసర 14 గ్రామాల మత్స్యకారులకు రాయితీపై వలలు బోట్లు వేట పరికరాలు ఇవ్వాలని, వడ్డీరహిత రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహాయాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లిఖి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి మాధవి, మాజీ సర్పంచ్ డి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డా. రామ్మోహనరావు బాధ్యతలు



పాడేరు (విజయభాను న్యూస్) : అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా డా.ఎల్ రామ్మోహన్ రావు సోమవారం లాంఛనంగా పదవి లబాధ్యతలు స్వీకరించారు. అల్లూరి జిల్లా పరిధిలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐ.టి.డి.ఏ ల పరిధిలోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందునట్లు కృషిచేస్తానని తెలిపారు.అనంతరం ఐటిడిఎ పిఓ గోపాలకృష్ణ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పాడేరు అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె లీలాప్రసాద్ , పాడేరు పి.ఒ డి.టి.టి డా. టి విశ్వేశ్వర నాయుడు , ఆరోగ్య విస్తారణాధికారి గుల్లేలి సింహాద్రి, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల బాధుడు రద్దు చేయాలి

## జివియంసి ఎదుట సీపీఎం మహాధర్నా




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజలపై వేసిన చెత్తపన్ను, పెంచిన ఆస్థిపన్ను, అక్రమ పెనాల్టీలు ,సెస్సులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ జివియంసి ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టింది. అంతకు ముందు గాంధీ విగ్రహం నుండి ప్రదర్శన నిర్వహించింది. మహాధర్నా సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ అధ్యక్షతన జివియంసి వద్ద సభ జరిగింది.

సభలో సిపియం నగర కార్యదర్శి ఎం. జగ్గునాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి ప్రజాభిప్రాయం మీద ఏ మాత్రం విశ్వాసం ఉన్నా ప్రజలపై పన్నుల బాదుడును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం యూజర్స్ ఛార్జీలు పేరుతో ప్రజల నుండి చెత్తపన్ను అదనంగా వసూలుకు పూనుకుంది. 1955 మున్సిపల్ చట్ట ప్రకారం ఇది చట్ట విరుద్ధం. ప్రజల నుండి అదనపు వసూళ్లకు పూనుకోవడం సరికాదు. చెత్తపన్నును వెంటనే రద్దు చేయాలి. నూతన ఆస్థిపన్ను విధానం ప్రజల ఆదాయాలను కొల్ల గొట్టేదిగా వుంది. ఇంటి అద్దె ఆధారిత ఆస్థిపన్ను చెల్లించుటకు ప్రజలకు అభ్యంతరం లేదు. కానీ! భూమిని నిర్మాణ విలువ ఆధారిత నూతన ఆస్థి పన్ను విధానం వలన పెద్ద ఎత్తున ప్రతి ఏటా పన్నులు పెరుగుతాయి. ప్రజల భరించలేరు. నూతన ఆస్థిపన్ను విధానం రద్దు చేయాలి. యుసి పెనాల్టీలు పేరుతో ప్రజలపై మరో భారం వేస్తున్నారు. ప్రభుత్వ జివోలకు విరుద్దంగా పెనాల్టీలు వేస్తున్నారు. మురికి వాడలు, కొండవాలు ప్రాంతాలను సహితం విడిచిపెట్టడం లేదు. ఈ అక్రమ పెనాల్టీలు రద్దు చేయాలి. ప్రభుత్వ గ్రంధాలయాలు ఏర్పాటు, నిర్వహణ చాలా పరిమితంగాను, అత్యంతలోపభూయిష్టంగాను వున్నాయి. గ్రంధాలయాలు అందుబాటు లేకుండానే ప్రజలనుండి గ్రంధాలయ సెస్సు వసూలు చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేసారు.

రౌడీలు, గూండాలు నుండి ప్రజలను కాపాడవలసింది ప్రభుత్వం. కానీ! ప్రభుత్వమే సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా అనేక రూపాల్లో ప్రజలను బెదిరిస్తున్నారు. ఇది నేరం. తక్షణమే ఆపాలని లేని పక్షంలో ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచింది. పెట్రోలియం ధరలు పెరుగుదల వలన వంట నూనె, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పన్నులు, విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతున్నది. బిజెపి, వైసిపిలు పోటీ పడి ధరలు బాదుతుంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు.

సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్కెఎస్వి కుమార్, బి.పద్మ, బి.జగన్ మాట్లాడుతూ ప్రభుత్వం చట్ట విరుర్ధంగా చేసిన చెత్తపన్నును కట్టకుండా ప్రతిఘటిస్తున్న ప్రజలను అభినందించారు. ప్రజలు చెత్తపన్నును. నూతన ఆస్థి పన్ను విధానం, అక్రమ పెనాల్టీలు, సెస్సులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికీ 90% ప్రజలు చెత్తపన్ను చెల్లించలేదు. కోవిడ్ తరువాత కూడా ఉపాధి, ఆదాయాలు తగ్గి ఆర్థిక ఇబ్బందుల్లో వున్న ప్రజలపై ప్రభుత్వం పన్నుల భారం విధించడం అన్యాయం. ప్రభుత్వం ప్రజల గోడు వినాలి. పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేసారు.

పన్నులు రద్దు అయ్యేవరకు మరింత పట్టుదలగా ఆందోళన కొనసాగించాలని పిలుపునిచ్చారు. నగర మేయర్, కౌన్సిల్ వెంటనే సమావేశం జరిపి చెత్తపన్నులు నూతన ఆస్థిపన్ను, పెనాల్టీలు రద్దు చేస్తూ వెంటనే తీర్మాణం చేయాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో శాంతియుతంగా జరుగుతున్న ప్రజా ఆందోళన తీవ్ర రూపం దాల్చడం తప్పదని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. వార్వా నగర ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్ మాట్లాడుతూ అపార్టుమెంట్ వాసులు ఇప్పటికే వివిధ రూపాల్లో ఈ పన్నుల భారంపై ఆందోళన చేస్తున్నారని, పన్నులు రద్దు అయ్యేవరకు వార్వా తనవంతు ఆందోళన చేస్తుందన్నారు.

సభలో సిపిఎం నగర నాయకులు పి.వెంకటరెడ్డి, జి.సుబ్బారావు, బి.వెంకటరావు, బి.రమణి, వి.క్రిష్ణారావు, ఆర్.లక్ష్మణమూర్తి, ఎం.రాంబాబు, డి.అప్పలరాజు, ఎ.నరేంద్రకుమార్, ఆర్.పి.రాజు, పి.మణి, కె.సత్యవతి, బి.భారతి, కె.కుమారి, బి.మమత, కె.ప్రభావతి, ఆర్.ఎన్.మాధవి, ఆర్.వరలక్ష్మి, కె.సంతోషం, ఎస్.శ్రావణ్, కె.అప్పలరాజు, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, ఎం. సూరీడు, ఎం.వి.ప్రసాదరావు, టి.నూకరాజు, యు.రాజు, కె.వి.పి.చంద్రమౌళి, కె.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు స్వచ్ఛ సర్వేక్షన్ పై అవగాహనా కార్యక్రమం...



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీ నగర్ స్కేటింగ్ పార్క్ ప్రాంగనంలో మంగళవారం ఉదయం 6.30 ని.లకు స్వచ్ఛ సర్వేక్షన్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనివర్సల్ యూత్ అధ్యక్షులు చింతలపాటి వంశీ కృష్ణ వర్మ తెలిపారు.ఆజాద్ కి అమృత మహొత్సవంలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ పై అవగాహనతో భారత దేశంలో విశాఖ నగరం నెంబర్ వన్ ర్యాంక్ సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపు మేరకు ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు వర్మ తెలిపారు. మురళీ నగర్ స్కేటింగ్ పార్క్ అధ్యక్షులు సనపల వరప్రసాద్, సహకారంతో జరిగే ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ బ్రాండ్ అంబాసిడర్, నిర్మాత, దర్శకులు, ప్రముఖ నటులు, చంటి ఫేమ్ ప్రసన్నకుమార్, విశిష్ట అతిధిగా జివిఎంసి సిఎంఒ శాస్త్రి పాల్గొంటున్నారని యూనివర్సల్ యూత్ కో ఆర్డినేటర్ సిహెచ్ ఇంద్ర దీప్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీ నగర్ వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్, మాధవదార మహిళా వాకర్స్, వైభవ్, సృజన వాకర్స్ క్లబ్స్ పాల్గొని తమ సహకారం అందిస్తున్నారని వంశీ కృష్ణ వర్మ తెలియజేశారు.

# రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులుగా గొల్లంగి ఆనంద్ బాబు



మధురవాడ (విజయభాను న్యూస్) : టీడీపీని పార్టీని నమ్ముకున్న వారికి సముచిత స్థానం లభిస్తుందని బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపికైన గొల్లంగి ఆనంద్ బాబు అభిప్రాయం వ్యక్తం చేసారు, ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ తనను నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, కార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచెంన్నాయుడు, అలాగే భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి కోరాడ రాజబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం జరుగుతుందన్నారు. టిడిపికి బలమైన కార్యకర్తల బలం ఉందని, దాన్ని మరింత పెంచుకోవాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో టిడిపిని బలపరిచేందుకు కార్యకర్తలు, స్థానిక నాయకులతో కలిసి మధురవాడ లో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పూర్తి స్థాయిలో తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే

## - ఈపిడిసిఎల్ లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఈపిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 196వ జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆధ్వర్యంలో సంస్థ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం ఘణంగా నిర్వహించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి సిఎండి కె.సంతోషరావు పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ జీవితంలో అవమానాలకు కృంగిపోకుండా ధీటుగా ఎదుర్కొని అణగారిన కులాల అభ్యున్నతికి, స్త్రీ జనోద్ధరణకు విశేష సేవలు చేసి సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలేను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. జ్యోతిరావు పూలే మొట్టమొదటి "మహాత్మ" బిరుదాంకితుడన్నారు. "సత్యశోధక సమాజ్" ని స్థాపించి సాంఘిక అసమానతలను తొలగించేందుకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్తని తెలిపారు.

పూలే రాసిన "గులాంగిరి" (బానిసత్వం) పుస్తకం నేటితరానికి ఆనాటి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఎంతగానో తోడ్పడిందన్నారు. స్త్రీ అక్షరాస్యత ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని పూలే నమ్మేవారని, అందుకే ముందుగా తన భార్యకు విద్య నేర్పి ఆమె ద్వారా ఎంతోమంది మహిళలకు విద్య నేర్పారని తెలిపారు. అటువంటి మహనీయుని జయంతి వేడుకలు జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.చంద్రం, బి.రమేష్ ప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, ఏ.వి.వి.సూర్యప్రతాప్, సి.శ్రీనివాసమూర్తి, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర, జి.చిరంజీవిరావు, బి.రామచంద్రప్రసాద్, జనరల్ మేనేజర్లు, అసోసియేషన్ల నాయకులు పోలాకి శ్రీనివాసరావు, ఎస్.రామకృష్ణ, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# గీతంలో ఎంటర్ ప్రెన్యూర్ "మహోత్సవ్"

## వర్సిటీ ఆధ్యాపకులకు సరికొత్త శిక్షణ



సాగర్‌నగర్ : (విజయభాను న్యూస్) : విశ్వవిద్యాలయం అధ్యాపకులలో సామాజిక సమస్యలపైన, ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ మహోత్సవ్ పేరిట సరికొత్త కార్యక్రమానికి సోమవారం ఆరంభించింది. గీతం ఎకడమిక్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, సైన్స్ డీన్ ఎమ్.బాలాకుమార్ హజరై దిశానిర్ధేశం చేసారు. అధ్యాపకులు నిరంతరం నూతన ఆలోచనలను పెంచుకోవడం ద్వారా బోధన విధానాలను సహితం మెరుగుపరుచుకోవచ్చునని వారు పేర్కొన్నారు. గీతం విడిసి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ వివిధ కోర్సులు బోధించే అధ్యాపకులకు సమాజం ఎదుర్కొనే వివిధ సమస్యలను పరిష్కరించే బాధ్యతను ఇవ్వడం ద్వారా వారందరు బృందాలుగా ఏర్పడి నూతన పరిష్కార మార్గాలను సూచించగలుగుతారని తెలిపారు. దీనికి గాను గీతం విడిసి ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించి అధ్యాపకులు తమ నూతన ఆలోచనలను వ్యాపారాత్మకంగా ఎలా మలచుకోవచ్చో తెలియజేస్తుందన్నారు. ఈ ఉత్సవం 7 నెలల పాటు ఎంపిక చేసిన తేదీలలో కొనసాగిస్తామని వెల్లడించారు. ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్, లా విభాగాలకు చెందిన దాదాపు 200 మంది అధ్యాపకులను ఎంపిక చేసి వారి ద్వారా నూతన ఆలోచనలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కాగా సోమవారం జరిగిన ఆరంభ కార్యక్రమంలో పట్టణాలలో ప్రజలకు వ్యయం లేని పరిశుభ్ర తాగునీటిని అందించే మార్గాలను అన్వేషించాల్సిందిగా సూచించగా మొత్తం 9 ఆవిష్కరణలను న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. కార్యక్రమంలో బాగంగా నూతన స్టార్టప్‌ల ద్వారా రాణిస్తున్న పర్స్పెక్ట్ ఐఇ సంస్థ సిఇఓ జిగ్నేష్ తలసిల, డ్రోన్ టెక్ సిఇఓ గోపిరాజా, గాయిత్రి విద్యా పరిషత్ ఇన్నోవేషన్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ ఎస్. రవిశంకర్ పాల్గొని నూతన ఆలోచనలను వ్యాపారాత్మకంగా ఎలా మలచుకోవచ్చో వివరించారు.



# మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి




భీమునిపట్నం, (విజయభాను న్యూస్): భీమిలి అవంతి క్యాంపు కార్యాలయం లో 3వ వార్డు వై.ఎస్.సి పి. బీసీ సెల్ అధ్యక్షులు కోండ్రు రామసూరప్పడు ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 3వ వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగ రావు మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త , ఉద్యమకారుడు, సంఘ సేవకుడైన జ్యోతిరావు పూలే తన సహచరిని సావిత్రి భాయ్ పూలే ని భారతదేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా తయారుచేసి ఆడపిల్లలు ఇంట్లో నుండి బయటికి తిరగకూడదని ఆచారానికి వ్యతిరేకంగా ఆ రోజుల్లో మొదటిసారిగా మహిళ పాఠశాల నిర్మించి ఎందరో బాలికలకు విద్య నేర్పించి ఆదర్శంగా నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో భీమిలి నూకాలమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు , మాజీ కౌన్సిలర్లు మైలపల్లి లక్ష్మణరావు, పాసి స్వర్ణలత ఉపాధ్యక్షులు వాసుపల్లి ఎల్లాజీరావు, బాకీ రమణారెడ్డి, కోశాధికారి గొరపల్లి సన్యాసిరావు, అనపర్తి సూర్య ప్రకాష్, , డింగి దుర్గారెడ్డి, బోని సంజీవ రావు , వి జగ్గారావు, కె నరేంద్ర కుమార్,తదితరులు పాల్గొన్నారు.అలాగే టిడిపి ఆధ్వర్యంలో భారత ప్రధమ సామాజిక తత్వవేత్త, ఉద్యమ కారుడు, సంఘ సేవకులు జ్యోతీరావు పూలే అని టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు. సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలే 195వ జయంతిని పురస్కరించుకుని టీడీపీ కార్యాలయం లో పూలే చిత్ర పటానికి గంటా నూకరాజు, 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ సంయుక్తంగా పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో టి డి పి నాయకులు, మాజీ కౌన్సిలర్ చురకల రమణ, నాయకులు కాసరపు నాగరాజు, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, వాడమొదలు సత్యారావు, షేక్ అన్వర్, సంకురుభుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, గండిబోయిన పోలిరాజు, వాసుపల్లి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# పరవాడలో సచివాలయ సిబ్బందితో విస్తృత సమావేశం



పరవాడ (విజయ భాను న్యూస్) : పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్య క్షతన సచి వాలయం సిబ్బంది తో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ముందుగా మహాత్మా జ్యోతిబా పూలే 196వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పిం చారు. అనంతరం సచివాలయం సిబ్బంది తో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం లో పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి లో గల సమస్యలు మరియు అభివృద్ధి కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజా ప్రతినిధులుతో సమన్వయం తో కలిసి పని చెయ్యాలని సిబ్బంది కి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు, సచివాలయం వ్యవస్థ మరియు వాలంటీర్ వ్యవస్థ లో లోపలను సరిచేసుకోవాలిని సూచించారు. అర్హుల అందరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి అని కోరారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిం చిన ఉద్యోగుల పై తగిన చర్యలు తీసుకుంటామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు , పరవాడ ఎంపిడిఒ హేమ సుందర రావు, ఇఒఆర్ డి పద్మజ , పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శిలు, ఏపిఎమ్ సాయి రమేష్, పిఆర్ ఎఇగండి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా మనమంతా పని చేయాలి

## - పెరిగిన ధరలతో సామాన్య ప్రజానీకానికి షాక్ ఇస్తోంది

## - టీడీపీ మండల బాడీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



అల్లూరి జిల్లా.పాడేరు.(విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టీ(టీడీపీ) మండల పార్టీ సమావేశం సోమ వారం మండలంలో గల కుమ్మరిపుట్టు గ్రామంలో పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ఆమె నివాస గృహంలో నిర్వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పోలుపర్తి గోవిందరావు, పాడేరు నియోజకవర్గం ఇంచార్జి, గిడ్డి ఈశ్వరి రాజకీయ గురువుగా ఉంటూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆయన్ని తెలుగుదేశం పార్టీ అధిష్టానం గుర్తించి ఈ టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నివాస గృహంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు వర్తక సంఘం నాయకులు కేక్ కట్ చేసి దుశాలవాలతో ఆయన్ని సన్మానించారు. అనంతరం మండల బాడీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ.... పార్టీలో కష్టపడి పని చేసిన వారిని పార్టీ గుర్తించి నామినేటెడ్ పదవులు ఇస్తుందని అన్నారు అలాగే వైసీపీ ప్రభుత్వం చేస్తున్నా అవినీతి అక్రమాలు ప్రజాలవద్దకు తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర వస్తువులపై పెరిగిన ధరలు సామాన్యుడికి షాక్ ఇస్తుందన్నారు. ముఖ్యంగా నిత్యవసర వస్తువులు ధరలు గణనీయంగా పెరిగిపోవడంతో సామాన్య జనం కొనలేకపోతు న్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా విపరీతంగా పెరిగిపోతున్నాయని, పెరిగిపోతున్న పెట్రోల్ డీజిల్ ధరలు కారణంగా రవాణా రంగం మీద తీవ్ర ప్రభావం పడుతుందని పెరిగిన ధరలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.ప్రతి ఒక్క నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పని చేసే 2024లో పాడేరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేసి మన నాయకుడు చంద్రబాబు నాయుడున్ని ముఖ్యమంత్రి చేయడంమే లక్ష్యంగా మనమందరం కలిసికట్టుగా పని చేయాలని నాయకులకు కార్యకర్తలను సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ ఉప అధ్యక్షులు పొల్లుపర్తి గోవిందరావు, మాస్టర్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోడా, వెంకట సురేష్ కుమార్, అరకు పార్లమెంట్ మహిళ కార్యదర్శి గబ్బడి శాంతి కుమారి,అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగపూజరి శివకుమార్,బీసీ సెల్ అరకు పార్లమెంట్ ఉప అధ్యక్షులు బూరెడ్డి నాగేశ్వరవు ,అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి డిప్పల వెంకట కుమారి,పాడేరు మండల ప్రెసిడెంట్ కుడి రామునాయుడు, రొబ్బి రాము,గుడెపు ఉషారాణి, ఎంపీటీసీ, తొక్కల ఈశ్వరరావు, అల్లంగి సుబ్బలక్ష్మి, కీల్లు వెంకట రత్నం,బొజ్జన్నా, కీల్లు రాధాకృష్ణ, కె రమేష్ నాయుడు, గబ్బడి, సింహాచలం, రాంబాబు, కొంతేలి వెంకట ప్రసాద్,బుద్ధ జ్యోతి కిరణ్,మండల పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న చిన్నలబుడు గ్రామస్థులు



అరకులోయ (విజయ భాను న్యూస్) : మండలం లోని చిన్న లబుడు పంచా యతీ చిన్న లబుడు గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ కమిటీ మరియు అరకు పార్ల మెంట్ డిస్టిక్ ఇన్చార్జి పాచి పెంట శాంత కుమారి ఆధ్వ ర్యంలో వైసిపి కార్య కర్తలను కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించి గోల్లోరి బలరాం, గోల్లోరి గిరిబాబు,గోల్లోరి క్రిష్ణ, కిల్లో రఘురాం,హట్టగుడ గ్రామం నుండి గోల్లోరి పద్మ,గోల్లోరి కోండమ్మ, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వీరితో పాటు 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే గిరిజనులకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా నాయకురాలు పాచిపెంట శాంతకుమారి గ్రామస్తులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరకు వేలి మండల అధ్యక్షుడు బోయి మోహన్ రావు,మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శెట్టి భగత్రం, పోద్దు మోహన్ రావు కిల్లో కొండలరావు, పి మాలతి,మాదల పండు,దోన్ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే సింహాద్రి నాధుని వార్షిక కల్యాణమహోత్సవం

## రాత్రి 8 గం లకు రథోత్సవం అనంతరం కల్యాణోత్సవం,

## రథం ట్రైల్ రన్ నిర్వహించిన అధికారులు





సింహాచలం ంంంం (విజయ భాను న్యూస్) :భక్తుల కొంగు బంగారం ఉత్తరాంధ్ర ఒడిశా ప్రజల ఇలవేల్పు సింహగిరి పై వేంచేసియున్న శ్రీ సింహాద్రి నాధుని వార్షిక కళ్యాణ మహోత్సవం నేడు సింహగిరి పై నృసింహ మండపం లో వైభవంగా నిర్వహించనున్నారు సోమవారం సాయంత్రం విశ్వ క్సేన ఆరాధన విశేష హెూమములు పున్యాహవచనము ఋత్విగ్వరణము ఉత్సవాంగీకారము మృతప్రంగ్ర హనము అంకురారారోపణము తో వార్షిక కళ్యాణోత్స వాలు ప్రారంభమవగా నేడు సాయంత్రం కొట్నాల ఉత్సవం ఆరాధనం గ్రామ బలిహరణం అనంతరం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాత్రి 7 గం లకు ఎదురు సన్నాహోత్సవము అనంతరం ఉత్సవమూర్తులను గోవిందరాజస్వామి అమ్మవార్లను రథం పై ఆసీనుల గావించి అనంతరం భక్త జనసమూహం నడుమ మేల తాళాలు మంగళవాయిద్యాల నడుమ పులివేశాలు హరినామ సంకీర్తనలు నడుమ వైభవంగా రదోత్సవం జరగనున్నది అనంతరం స్వామి అమ్మవార్లను మండపంలో సువాసనలు విదజిల్లే మల్లెపూలు ముత్యాల మండపలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దిన కళ్యాణ వేదిక పై స్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించనున్నారు ఈ సందర్భంగా భక్తులకు త్రాగునీరు వసతి అన్నప్రసాధం దేవస్థానం అధికారులు భారీ యెత్తున ఏర్పాటు చేయగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా రథానికి ట్రైల్ రన్ నిర్వహించారు.

# సీఎం జగన్ ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయం

## ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు



అచ్యుతాపురం ( విజయ భాను న్యూస్ ) : సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శ నీయమని యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. సోమవారం మండ లంలో హరిపాలెం గ్రామంలో పలు గ్రామాలలో వాలంటీర్లకు ఎమ్మెల్యే కన్నబాబురాజు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేశారు. అంతకముందు పలు అభివృద్ధి కార్యక్రామలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ యు సుకుమార వర్మ (తేజ), ఎంపీపీ కోనా సంధ్య బుజ్జి , జడ్పీటిసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జడ్పీటిసీ నర్మాల కుమార్, సర్పంచ్ లు దేశంశెట్టి శంకరరావు, కూండ్రపు విమలానాయుడు, సియాద్రి బుజ్జి, పీలా నరసింగరావు, ఎంపిటీసీ లు నగిరెడ్డి నాగేశ్వరరావు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో సామాజిక న్యాయం


- 70% బడుగు బలహీన వర్గాలకు స్థానం
- ప్రపంచ దేశాల ప్రశంసలు పొందిన కామర్స్ కమిటీ ఐపీఆర్ నివేదిక
- విశాఖ-చెన్నై కారిడార్ రెండో దశ రూ 551.9 కోట్ల పనులకు టెండర్ల ఆహ్వానం
- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు పేద ప్రజలకు వరం
- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయి రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో 70% బడుగు బలహీన వర్గాల వారికి అవకాశం కల్పించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సామాజిక విప్లవం తీసుకొచ్చారని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. సామాజిక న్యాయం ఒక నినాదంలా మిగిలిపోకుండా కొత్త మంత్రివర్గ కూర్పులో దాన్ని ఆచరించి చూపించారని అన్నారు పరిపాలనలో అనేక సంస్కరణలు చేపట్టి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎం జగన్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో సామాజిక న్యాయం పాటించి, ఇతర రాష్ట్రాలకు, రాబోవు తరాల వారికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బిసి వర్గాలకు 10, ఎస్సీ వర్గాలకు 5, ఎస్టి వర్గాలకు 1, మైనార్టీ వర్గాలకు 1 చొప్పున మంత్రి పదవులు కేటాయించి బడుగు బలహీన వర్గాలపై తన ప్రేమను చాటుకున్నారని అన్నారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ హక్కులపై తన అధ్యక్షతన పార్లమెంటరీ వాణిజ్య కమిటీ తయారు చేసిన నివేదికకు అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుంచి మంచి గుర్తింపు లభించడం మిక్కిలి సంతోషంగా ఉందని అన్నారు. ఈ నివేదిక భారతదేశ ఐపిఆర్ (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) విధానాన్ని అంచనా వేయడంలో మెట్టమెదటి ప్రధాన ప్రయత్నంగా యు.ఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొందని అన్నారు. వివిధ రాష్ట్రాల అడ్వకేట్ జనరల్స్, దేశంలోని ప్రముఖ న్యాయ సంస్థలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సంప్రదించి కమిటీ తన నివేదికలో పలు సూచనలు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఈ నివేదిక పార్లమెంట్ ఉభయసభలకు సమర్పించడం జరిగిందని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. విశాఖ-చెన్నై కారిడార్ రెండో దశ పనులపై ఏపీఐఐసీ దృష్టి సారించిందని, ఇందుకోసం మూడు క్లస్టర్లలో రూ.551.9 కోట్ల విలువైన పనులకు టెండర్లను ఆహ్వానించిందని అన్నారు. రూ.5,604 కోట్లతో రెండు దశల్లో కారిడార్ ను అభివృద్ధి చేయనుండగా, తొలిదశ పనులు తుదిదశకు చేరుకోవడంతో ఇప్పుడు రెండవ దశ పనులపై దృష్టి సారించిందని అన్నారు. విశాఖ నక్కపల్లి క్లస్టర్ లో రూ.302 కోట్లతో స్టార్టప్ ఏరియా అభివృద్ధి చేసేందుకు, అచ్యుతాపురం - రాంబల్లి క్లస్టర్ లో రూ.105.79 కోట్లతో మౌలిక వసతుల కల్పించేందుకు, చిత్తూరు సౌత్ క్లస్టర్లో రూ.144.10 కోట్లతో కీలక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచిందని అన్నారు. నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన నిరుపేద మహిళని ప్రసవానంతరం బిడ్డతో సహా సుమారు 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు జిల్లాలోని ఆమె సొంత గ్రామానికి చేర్చిన తల్లీ-బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు ఆదర్శనీయమని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన ప్రతీ వ్యవస్థ ఎంత మేరకు చిత్తశుద్ధితో పనిచేస్తుందనే దానికి ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. రానుపోను 700 కి.మీ. ప్రయాణించి తల్లీ బిడ్డలకు సురక్షితంగా ఇంటికి చేర్చిన సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

# దేశంలో హెచ్.ఐ.వి కేసులు జీరో శాతం

- జాతీయ సదస్సులో డాక్టర్ కూటికుప్పల




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దేశంలో హెచ్ఐవి కేసులు జీరో శాతానికి తగ్గాయని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు పేర్కొన్నారు. అపోలో మెడికల్ కాలేజీలో జరిగిన "ఎకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా" జాతీయ సదస్సులో ప్రసంగించిన ప్రముఖ వైద్య నిపుణులు పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. కూటికుప్పల సూర్యారావు ఫ్యామిలీ ఫిజిషియన్స్ వ్యవస్థను పునరిద్ధరిస్తే దేశంలో కరోనా, టి. బి., హెచ్.ఐ.వి కి పూర్తిగా చరమగీతం పాడవచ్చని, ఈ దిశగా ప్రభుత్వాలు చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

పాతరోజుల్లో "కుటుంబ వైద్యుడు" లేని ఇల్లు ఉండేది కాదు. అందుకే ఆ రోజుల్లో మానసిక రోగాలు, లైఫ్ స్టైల్ డిసీజెస్ నామమాత్రంగా ఉండేవి. ఈ రోజున అనేక కుటుంబాలకు సరైన వైద్య సలహా లేక, అనవసర వైద్య ఖర్చుల ఉచ్చులోపడి పేదరికాన్ని కొనితెచ్చుకుంటున్నారు. బ్రిటన్ లాంటి ఎన్నో ఐరోపా దేశాల్లో ఈ రోజుకి ఫ్యామిలీ ఫిజిషియన్స్ వ్యవస్థ ఎంతో గణనీయంగా పటిష్టంగా పనిచేస్తుంది. ప్రతి మెడికల్ కాలేజీలో ఎం.డి ఫ్యామిలీ మెడిసిన్ ప్రారంభించాలని జాతీయ సదస్సు తీర్మానం చేసింది. ఫ్యామిలీ మెడిసిన్ డాక్టర్లకు ప్రభుత్వంలో కేడరు సృష్టించి వారి సేవల్ని ప్రైమరీ హెల్త్ కేర్ లో ఉపయోగించుకుంటే ఎంతో మేలు జరుగుతుందని డా. జయప్రకాష్ నారాయణ విశ్రాంత ప్రిన్సిపల్ సెక్రటరీ కోరారు.

డా.సుజాత రావు ఐ.ఏ.ఎస్ విశ్రాంత కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ఫ్యామిలీ మెడిసిన్ ను విస్మరించడం ఆరోగ్య భద్రత లో పెద్ద లోపం అని చెప్పారు.

సదస్సులో పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ డా. శ్రీనాథ రెడ్డి, అంతర్జాతీయ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. సదస్సు నిర్వాహకులు, ముఖ్య అతిథులు నిమ్స్ పూర్వ డీన్ ప్రొఫెసర్ శాంతారాం, సి.ఎం.సి వేల్లూరు, అపోలో మెడికల్ కాలేజీ డీన్ ప్రొఫెసర్ దిలీప్ మత్తై, ఎయిమ్స్ డైరెక్టర్ డా. భాటియా, సెయింట్ జాన్ మెడికల్ కాలేజ్ బెంగళూర్ ప్రొఫెసర్ రవీంద్రన్ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రం ను బహుకరించారు.

# నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారాన్ని సాగించండి

- లాభాలలో సమాజ సేవకు కొంత కేటాయించండి
- మహా స్వామి వారి దివ్య హస్తములతో హైవే వెంచర్స్ వారి చాణిక్యస్ కాన్సెప్ట్ సిటీ స్టే నూతన బ్రోచర్ ఆవిష్కరణ
- సంస్థ యజమాని హేమరావుకు ఆశీస్సులు అందజేసిన శారదా పీఠాధిపతులు మహా స్వామి వారు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వినియోగదారులకు నాణ్యత, నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారాన్ని సాగించాలని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు పేర్కొన్నారు.

ప్రముఖ రియల్ వ్యాపార సంస్థ "హైవే వెంచర్స్" వారి ' చాణిక్యస్ కాన్సెప్ట్ సిటీ స్టే' నూతన బ్రోచర్ ను విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారు, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి వారు తమ దివ్య హస్తములపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహా స్వామి వారు మాట్లాడుతూ వ్యాపార లాభాలలో సమాజ సేవకు కొంత కేటాయించి ఇతరులకు సహాయం చేయాలని, వినియో




గదారుల నమ్మకాన్ని పొందాలని తెలియజేశారు. అనంతరం హైవే వెంచర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చింతాడ హేమరావు కు మహాస్వామి వారు ఆశీస్సులు అందజేశారు.

# అప్పన్న ను దర్శించుకున్న కేజీఎఫ్-2 హీరో యాష్



సింహాచలం:శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి వారిని సోమవారం కేజీఎఫ్-2 హీరో యాష్ వాహిని స్టూడియో అధినేత కొర్రపాటి సాయి స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారినీ కప్ప స్తంభం ఆలింగనం బేడ ప్రదక్షిణ చేసి చేయించి స్వామివారి దర్శనం తదుపరి వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలను ఇఓ ఎంవి సూర్య కళ అందజేశారు.









అంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో విజయవాడ వెలగపూడి లో నూతనంగా ఏర్పడిన మంత్రివర్గం లో మంత్రులుగా స్థానం సంపాదించి సోమవారం ప్రమాణస్వీకారం చేసిన బొత్స సత్యన్నారాయణ, , బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్ లను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com